క్లుప్తంగా

పొంచి ఉన్న ప్రమాదం



కల్వర్టు వద్ద గొయ్యి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని కేటీరోడ్డుపై కల్వర్టు, చెక్‌పోస్టు వద్ద రోడ్డు పక్కన భారీ గొయ్యిలు ప్రమాదాలను ఆహ్వానిస్తున్నాయి. వాహనాదారులు ఆదమరచి రోడ్డు దిగితే గొయ్యిలో పడి గాయపడాల్సిందే. ఈ రోడ్డుపై నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. మెయిన్ రోడ్డులోని కల్వర్టుకు ఇరువైపుల, చెక్‌పోస్టు వద్ద రోడ్డు పక్కన మట్టి భారీవర్షాలకు కోసుకుపోవడంతో గొయ్యిలు ఏర్పాడి ఉన్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి గొయ్యిలను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

బండారుపల్లెలో పారిశుద్ధ్య పనులు



బ్లీచింగ్ చల్లుతున్న కూలీలు

ఏర్పేడు: మండలంలోని బండారుపల్లెలో శనివారం పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా జరిగాయి. గ్రామంలోని రైస్‌మిల్లు, దక్షిణం, నడివీధిలో రోడ్లుపై మురుగునీరు చేరింది. మురుగునీటిని తొలగించి బ్లీచింగ్ చల్లారు. వీఆర్వో మణి, వైఎస్సార్ సీపీ నాయకులు మునికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని సీతారాంపేట వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. సీఐ శ్రీహరి కథనం మేరకు వివరాలు.. తిరుపతికి చెందిన శ్రీరాములు(43), సుధాకర్(31) ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వెళుతున్నారు. సీతారాంపేట వద్ద ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి అదుపుతప్పడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరూ గాయపడ్డారు. క్షతగాత్రులను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

కారు డ్రైవర్‌పై కేసు నమోదు

ఏర్పేడు: కారును అతివేగంగా నడిపి ఓ వ్యక్తిని గాయపరచిన ఘటనలో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి శనివారం తెలిపారు. మండలంలోని సీతారాంపేట పంచాయతీ పరిధి వెంకటాపురం గ్రామానికి చెందిన వత్సలయ్య ఈనెల 7న సైకిల్‌పై ఏర్పేడుకు వెళుతుండగా చెక్ పోస్ట్ వద్ద వెనుక నుంచి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వత్సలయ్య గాయపడ్డారు. శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బంధువులు శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో కారు డ్రైవర్ మహమ్మద్ ముస్కాన్‌అలీపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

శాంతిభద్రతలకు విఘాతం : ఐదుగురు అరెస్టు

ఏర్పేడు: టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అరెస్ట్‌కు నిరసనగా ఏర్పేడులో ట్రాఫిక్ నిలిపి వేసి ధర్నా చేసేందుకు ప్రయత్నించిన ఐదుగురు కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ శ్రీహరి శనివారం రాత్రి తెలిపారు. కార్యకర్తలు బాలగురునాథం, చంద్రశేఖర్, మునెయ్య, మునిరామిరెడ్డి, గోపాల్ ఏర్పేడులో ట్రాఫిక్‌ను నిలిపి వేసి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేసినట్లు వివరించారు. కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

రేణిగుంటలో..

రేణిగుంట: టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్ట్‌ను నిరసిస్తూ శనివారం ఆపార్టీ శ్రేణులు రేణిగుంట చెక్‌పోస్ట్ కూడలి వద్ద వాహనాలను ఆపి రాస్తారోకో చేపట్టారు. సీఎం దిష్టిబొమ్మను దహనం చేసి శాంతిభద్రతలకు విఘాతం కల్పించేందుకు యత్నించారు. ఎస్‌ఐలు ఈశ్వరయ్య, ధర్మారెడ్డి అక్కడికి చేరుకుని హింసాత్మక ఘటనలు జరగకుండా ఆందోళన చేస్తున్న వారిని అడ్డుకుని, ఐదుగురి అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ ఈశ్వరయ్య తెలిపారు.

విష జ్వరాలపై అప్రమత్తత అవసరం

కార్వేటినగరం: డెంగీ, మలేరియా వంటి వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరమని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. శనివారం మండల పరిధిలోని రాజులకండ్రిగ దళితవాడను సందర్శించి విషజ్వరాలపై అవగాహన కల్పించారు. విషజ్వరాల్లో ప్రమాదకరమైన డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి రోగాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అదే విధంగా కలుషిత నీరు తాగడం వల్ల వైరల్ ఫీవర్ వస్తుందని, ప్రతి దానికి ఆర్ఎంపీ వైద్యుల వద్దకు వెళ్లకుండా సమీపంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్లి తగిన పరీక్షలు చేయించుకోవాలని గ్రామస్తులకు సూచించారు. వరుసగా రెండు రోజుల పాటు జ్వరం ఉంటే ప్రభుత్వ వైద్యాధికారులను సంప్రదించాలని చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యర్థాలను ఇంటి ఆవరణలో లేకుండా చూడాలని తెలిపారు. ఈ క్రమంలో భాగంగా దోమల నివారణకు మిలాథిన్ స్ప్రే చేయించారు. వైద్యాధికారులు గోపీనాథ్, యూసఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా ముక్తిధామం

- రూ. కోటితో ప్రతిష్టాత్మకంగా పనులు
- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: ఆత్మీయుల చివరిమజిలీకి ఎలాంటి అవస్థలు లేకుండా పట్టణంలో దక్షిణ కైలాస ముక్తిధామాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శనివారం ముక్తిధామం పనులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 30ఏళ్లపాటు నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహించిన బొజ్జల కుటుంబం ప్రజలకు ఎలాంటి మేలు చేయలేదని విమర్శించారు. ప్రజల అవసరాలపై కూడా దృష్టి సారించలేదన్నారు. తాను ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తీరుస్తున్నట్లు తెలిపారు. శ్మశాన సమస్యను పరిష్కరించేందుకు తాను సొంత నిధులు రూ.కోటితో ముక్తిధామం నిర్మిస్తున్నానని తెలిపారు. దీన్ని ప్రతిష్టాత్మంగా నిర్మిస్తున్నామని, త్వరలోనే ప్రారంభమయ్యేలు పనులు సాగుతున్నాయని పేర్కొన్నారు. వార్డ్‌వాక్, గడప గడపకు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటూ సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య మంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఆశీర్వాదంతో దక్షిణకైలాస ముక్తిధామం పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజలకు ఏ అవసరం వచ్చిన తమ పార్టీ కార్యాలయంలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుమ్మడి బాలకృష్ణయ్య, ఉన్నం వాసు నాయుడు, వడ్లతాంగల్ బాలాజీప్రసాద్‌రెడ్డి, ముత్యాల పార్థసారథి, లతా, రమేష్, బుల్లెట్ జయశ్యామ్ హరినాయుడు, సురేష్, యుగంధర్‌రెడ్డి డిష్ ధర్మయ్య, దామోదర్‌రెడ్డి, హరి, స్వర్ణమూర్తి, అమీన్, పసల కృష్ణయ్య, లక్కమనేని కృష్ణ, రుషేంద్రమణి, ధనలక్ష్మి, ప్రమీలమ్మ, షర్మిలతాగూర్, చింత రాజేంద్ర, అబ్బు తదితరులు పాల్గొన్నారు.



ముక్తిధామం పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



కలర్‌టీవీ అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

వధూవరులకు ఆశీర్వాదం

ఏర్పేడు: మండలంలోని చింతలపాలెం పంచాయతీ మరాఠీపురానికి చెందిన వధూవరులను ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి శనివారం రాత్రి ఆశీర్వదించారు. మరాఠీపురానికి చెందిన డబ్బా పరశునాథ్ కుమార్తె మౌనికకు శ్రీకాళహస్తిలో శనివారం రాత్రి వివాహమైంది. ఎమ్మెల్యే వివాహానికి వెళ్లి వారిని ఆశీర్వదించి, కలర్ టీవీ, బంగారు చైన్, రూ.20 వేలు నగదును అందించారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మాక్‌డ్రిల్



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఆక్టోపస్ బృందాలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆవరణలో శనివారం ఆక్టోపస్ బృందాలు మాక్ డ్రిల్ నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆలయ అధికారులు మాట్లాడుతూ విపత్కర పరిస్థితులు ఏర్పడినప్పుడు రక్షణ చర్యలు ఎలా తీసుకోవాలనే అనే అంశంపై మాక్‌డ్రిల్ నిర్వహించినట్లు తెలిపారు. భక్తుల భద్రత కోసం ఆలయంలో భద్రత మరింత కట్టుదిట్టం చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా పోషకాహార మాసోత్సవాలు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం పోషకాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వాంపల్లి, తిమ్మవరం, మామిడిగుంట, గోవిందరావుపల్లె, ఇనగలూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, పోషకహార విలువలను వివరించారు. రక్తహీనత ఏర్పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. తక్కువ ఖర్చు అయ్యే ఆకుకూరలు, మొలకెత్తిన గింజలు, క్యారెట్, బీట్రూట్ వంటివి తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్ చెంచుకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 678 కేసుల పరిష్కారం

శ్రీకాళహస్తి: పట్టణంలోని న్యాయస్థాన భవనంలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 678 కేసులను పరిష్కరించారు. ఈసందర్భంగా జిల్లా 6వ అదనపు, పోక్సో న్యాయమూర్తి ఎస్.శాంతి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌తో కేసులు సత్వర పరిష్కారం అవుతాయని అన్నారు. కక్షిదారులు, ఫిర్యాదుదారులకు విలువైన సమయం ఆదా అవుతుందని తెలిపారు. ఎలాంటి ఫీజుల భారం లేకుండా పెండింగ్ కేసులను తక్షణం పరిష్కరించుకోవచ్చని చెప్పారు. లోక్ అదాలత్‌లో 678 కేసులను పరిష్కరించి, రూ.56,98,532 నగదును రికవరీ చేశారు. శ్రీకాళహస్తి సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి, న్యాయవాదులు పాల్గొన్నారు.

సత్యవేడులో 492 కేసుల పరిష్కారం

సత్యవేడు: సత్యవేడు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 492 కేసులు పరిష్కరించారు. రూ.41,62,617 రికవరీకి అడిషినల్ జూనియర్‌సివిల్ జడ్జి వి.గోపాల కృష్ణ ఆదేశించారు. ఐపీసీ కేసులు 41, వరకట్నం కేసులు 6, సివిల్ కేసులు 5, ఈపీ కేసులు 4, చెక్‌బౌన్స్ కేసులు 5, గృహ హింస కేసులు 2, పెట్టీ కేసులు 376, బ్యాంకు సంబంధిత కేసులు 37 పరిష్కారం అయ్యాయి. ఏపీపీ ప్రశాంతి, న్యాయవాదులు పీడీ వెంకటేశ్వర్లు, టి చంద్రశేఖర్, డి.వెంకటేశ్వర్లు, గోపినాథ్, కుబేరన్, బ్యాంకు అధికారులు, బీఎస్ఎన్ఎల్ అధికారులు, పోలీసు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీకాళహస్తి : మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి శాంతి

ముక్కంటి సేవలో మహిళా వర్శిటీ వీసీ



జ్ఞాపిక అందజేస్తున్నచైర్మన్ శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ భారతి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను చైర్మన్ శ్రీనివాసులు అందజేశారు.

జూనియర్ లైన్‌మన్ల సమస్యలు పరిష్కరించండి



మంత్రి పెద్దిరెడ్డికి సమస్యలను వివరిస్తున్న ఎనర్జీ అసిస్టెంట్ల యూనియన్ నాయకులు

నారాయణవనం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సచివాలయాల్లో పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్లు శనివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసి విన్నవించారు. మంత్రిని తిరుపతిలో ఆయన నివాసంలో కలిశారు. జూనియర్ లైన్‌మన్ (గ్రేడ్ 2) ఎదుర్కొంటున్న సమస్యలను ఎనర్జీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ 381/2022 నాయకులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వంతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్ మాట్లాడుతూ సర్వీస్ రూల్స్, ప్రమోషన్ చానల్‌కు సంబంధించిన ఉత్తర్వులు ఇవ్వలేదని అన్నారు. సచివాలయ, విద్యుత్ శాఖల మధ్య తీవ్ర ఒత్తిడులను గురవుతున్నామని అన్నారు. 24/7 కాకుండా సచివాలయ పని వేళలు వర్తింపజేయాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. రాష్ట్ర కమిటీ సభ్యులు హేమచంద్ర, సంజయ్, నవీన్ కుమార్, మునికుమార్, ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జ్ నిర్మాణానికి స్థల పరిశీలన



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి, పవిత్రారెడ్డి

రేణిగుంట: గాజులమండ్యంలో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఉండేందు కు అండర్ బ్రిడ్జి నిర్మాణానికి ఎంపీ మద్దెల గురుమూర్తి స్థల పరిశీలన చేశారు. గ్రామస్తుల వినతి మేరకు శనివారం ఆయన వైఎస్సార్ సీపీ రేణిగుంట మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డితో కలసి గాజులమండ్యంకు చేరుకున్నారు. అండర్ పాస్ బ్రిడ్జ్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి కార్యాచరణ చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ గంగారి రమేష్, నాయకులు జువ్వల ధనంజయరెడ్డి, వెంకటరమణారెడ్డి, ఆనందరావ్, జువ్వల దయాకర్‌రెడ్డి, పన్నీరుకాల్వ శ్రీధర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, భాస్కర్‌యాదవ్, నారయ్యాయాదవ్ పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ శ్రమదానం



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న విద్యార్థులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని శ్రీసరస్వతీబాయి పురపాలక సంఘం ఉన్నత పాఠశాల ఆవరణలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో శనివారం పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్కౌట్ మాస్టర్ ఎస్‌కే అజారుద్దీన్, ధనుష్ పాల్గొన్నారు.

కేసులతో ఉక్కిరి బిక్కిరి..

వరదయ్యపాళెం తహసీల్దార్ కార్యాలయాన్ని కోర్టు కేసులు వెంటాడుతున్నాయి. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన తహసీల్దార్లు చేపట్టిన అక్రమాలు ప్రస్తుత అధికారులను వెంటాడుతున్నాయి. దీంతో నిత్యం కోర్టులలో నమోదవుతున్న కేసులకు సమాధానం ఇచ్చేందుకు.. రిపోర్టులు తయారు చేయలేక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. మండలంలోని 29 పంచాయతీల పరిధిలో భూసమస్యలకు సంబంధించి 200లకు పైగా కేసులు హైకోర్టులో నడుస్తున్నట్లు అధికారిక సమాచారం.

- గతంలో అక్రమంగా పట్టాలను కట్టబెట్టిన రెవెన్యూ అధికారులు
- భూ సమస్యలపై 200కు పైగా హైకోర్టులో కేసులు
- వారంలో 4 రోజులకు పైగా హాజరు కావాల్సి వస్తున్న తహసీల్దార్
- మండలంలో పరిష్కారానికి నోచుకోని రెవెన్యూ సమస్యలు

వరదయ్యపాళెం: గత మూడేళ్లుగా తహసీల్దార్‌గా వచ్చే ఏ అధికారి అయిన కోర్టు కేసులకే పరిమితమవుతున్నారు. వారంలో 4రోజులకు పైగా విజయవాడలోని హైకోర్టుకు వ్యక్తిగతంగా హాజరవుతున్నారు. దీంతో సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ కార్యాలయానికి వచ్చే సామాన్య ప్రజలకు తహసీల్దార్ అందుబాటులో ఉండడం లేదు. మండలంలోని 29 పంచాయతీల పరిధిలో 45,586వేల ఎకరాల భూవిస్తీర్ణం ఉంది. ఇందులో ప్రధానంగా అపోలో టైర్ల పరిశ్రమ ఏర్పాటైన చిన్న పాండూరు, శ్రీసిటీ పరిధిలోని పలు గ్రామాలు, పాటు 132కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటైన రాచర్ల ప్రాంతంలో చిన్న పాండూరు రెవెన్యూలో ఏర్పాటైన అపోలో టైర్ల పరిశ్రమ కోసం భూములు కోల్పోయిన రైతులకు పూర్తి స్థాయిలో పరిహారం అందలేదు. ఇందుకు కారణం 2012–14 మధ్య విధులు నిర్వహించిన తహసీల్దార్, వీఆర్వోలు పరిశ్రమకు కేటాయించిన 384 ఎకరాలకు సంబంధించి ఒకరికి కేటాయించిన భూమినే తిప్పితిప్పి ఇద్దరు, ముగ్గురికి పెద్దఎత్తున ముడుపులు అందుకుని అక్రమ పట్టాలను అక్రమంగా కట్టబెట్టారు. అపోలోకు భూముల కేటాయింపు సమయంలో ఈ అక్రమ పట్టాల గుట్టురట్టైంది. అక్రమ పట్టాలు పొందిన వారి వద్ద డి–పట్టాలు లేకపోవడంతో మొదటగా ఇచ్చిన వారికే పరిహారమిచ్చారు. మిగిలిన అక్రమ పట్టాదారులు కోర్టులను ఆశ్రయించారు. ఆ దశగా ఒక చిన్న పాండూరు రెవెన్యూలోనే 150కి పైగా హైకోర్టులో కేసులు వేశారు.

పెండింగ్‌లో రెవెన్యూ సమస్యలు

మండలంలో పలు కీలక రెవెన్యూ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. కోర్టు కారణాలతో తహసీల్దార్ పూర్తిస్థాయిలో కార్యాలయానికి హాజరు కాకపోవడంతో సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ప్రధానంగా వరదయ్యపాళెం మేజర్ పంచాయతీ, ఇందిరానగర్ గ్రామాలకు సంబంధించి 450 మందికి ఇళ్ల స్థలాల పంపిణీ ప్రక్రియ ఆగిపోయింది. ఇందుకు సంబంధించి 15 ఎకరాల పట్టాభూమికి పరిహారం చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేసినప్పటికీ ఇంటి పట్టాలు పంపిణీ జరగలేదు. అలాగే మండలంలో ఉన్న 40,586 ఎకరాలకు సంబంధించి రీసర్వే ప్రక్రియ మందకొడిగా జరుగుతోంది. ఇప్పటివరకు 3187 ఎకరాల్లో మాత్రమే రీసర్వే ప్రక్రియ పూర్తయింది. రోజువారీ వచ్చే రెవెన్యూ సమస్యలు సైతం క్షేత్రస్థాయిలో తహసీల్దార్ సందర్శన చేసి పరిష్కరించాల్సి ఉండగా, ఎక్కడికక్కడే ఆగిపోతున్నాయి. మ్యుటేషన్ల ప్రక్రియ ఆలస్యమవుతోంది.



మూసి ఉన్న తహసీల్దార్ గది

ప్రత్యేక తహసీల్దార్‌ను నియమించాలి



మండలంలో రెవెన్యూ సమస్యలు పరిష్కారం కావడం లేదు. ప్రధానంగా ఉన్న తహసీల్దార్ కోర్టు పనుల మీద వెళ్లాల్సి వస్తోంది. కార్యాలయ బాధ్యతలను పూర్తిస్థాయి పర్యవేక్షణకు ఒక తహసీల్దార్, కోర్టు కేసులకు సంబంధించి మరో తహసీల్దార్‌ను నియమించేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపాలి.

– భాస్కర్‌రెడ్డి, రైతు, పెద్ద పాండూరు

స్పందనకు కూడా గైర్హాజరు



ప్రతి సోమవారం నిర్వహించే స్పందనకు కూడా తహసీల్దార్ హాజరు కావడం లేదు. తాజాగా సోమ, మంగళ వారాల్లో తహసీల్దార్ హాజరుకాలేదు. కార్యాలయ సిబ్బంది కోర్టుకు హాజరైనట్లు తెలిపారు. తహసీల్దార్ రెగ్యులర్‌గా హాజరు కాకపోతుండడంతో సమస్యలు పెండింగ్‌లో పడుతున్నాయి.

– చిన్నిరాజ్, సీపీఐ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి